
# మనసు విప్పి మాట్లాడు



గురుసాక్షాత్ అపరకీచక

ప్రేమించానంటూ విద్యార్థినికి వేధింపులు

కాళ్లూ చేతులూ కట్టేసి చితకబాదిన జనం

సిరిసిల్ల, మార్చి 11 (ఆన్‌లైన్): విద్యార్థిపై మోజు పడిన ఓ గురువు గోడదూకి జనం చేతిలో తన్నులు తిన్నాడు. ఈ సంఘటన శుక్రవారం తెల్లవారుజామున కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో చోటు చేసుకుంది. కేరళలోని కాలికట్ ప్రాంతానికి చెందిన అహ్మద్ అస్లం( 22) సిరిసిల్ల పట్టణంలోని కేరళ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సంవత్సర క్రితం టీచర్‌గా పనిచేయడానికి వచ్చాడు. ఎంతో చక్కగా పాఠాలు బోధిస్తున్నాడని భావిస్తున్న క్రమంలోనే అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న 15 సంవత్సరాల

విద్యార్థినిని ప్రేమిస్తున్నాంటూ వేధింపులకు గురిచేయడం మొదలుపెట్టాడు. శుక్రవారం తెల్లవారుజామున గాంధీనగర్‌లోని విద్యార్థిని ఇంటిగోడ దూకి తనని ప్రేమించమంటూ వేధింపులకు పూనుకున్న సందర్భంలోనే అప్పుడే నిద్రలేస్తున్న జనం వీరిని గమనించడంతో అస్లం పరుగులు తీశాడు. దీన్ని గమనించిన జనం అతడిని వెంటాడి పట్టుకొని కట్టేసి చితకబాది అనంతరం పోలీసులకు అప్పగించారు. పోలీసులు అదుపులో వున్న అస్లం మాత్రం తాను ప్రేమించానని, అందుకు ఆమె నిరాకరించడంతో తాను కేరళకు వెళ్లిపోతూ ఆ విషయం చెప్పడానికి గోడదూకానంటున్నాడు. విద్యార్థిని అమ్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల ఎస్ఐ నాగేంద్రాచారి తెలిపారు.

**ఈ కథకు స్పందన**

" మమ్మీ నా క్లాస్‌మేట్ లలిత ఆత్మహత్య చేసుకుందే. నాకేదో టెన్షన్‌గా ఉంది. కాలేజికి పోవాలనిలేదు. ఎగతాళి చేస్తారేమోనని బెంగ, ఫ్యాన్ తిరుగుతున్నా ఏదో గాబరా.. క్లాసికి వెళ్ళాలంటేనే పిచ్చెక్కినట్లుంది. ప్లీజ్ మమ్మీ నన్ను ఫోర్సు చేయకే. దాడి అడిగితే ఏదో ఒకటి చెప్పేసేయ్" అంటూ పద్దెనిమిదేళ్ళ సబిత లేతమనసుతో విలవిలలాడుతూ, హృదయవిదారంగా తనబాధను వెళ్ళబుచ్చుకుంది.

తల్లికి తప్పా ఎవరితోనూ మనసువిప్పి మాట్లాడని సబిత వేదన తల్లి పంకజానికి చెప్పుకోవడం, పదిహేను రోజుల తరువాత, అప్పుడే క్యాంపు నుండి తిరిగివస్తూ తలుపు దగ్గర నిలుచొని అంతా విన్నాడు సబిత తండ్రి విఠల్.

మనసంతా స్థబ్దుగా మారిపోయింది. సబిత మానసిక ఆందోళనతో సతమతమవుతుంటే విఠల్‌కి ఏమీ తోచలేదు. అసలేం జరిగిందో నిదానంగా సబిత దగ్గర్నుండి రాబట్టుకోవాలని మెల్లగా లోపలికి వెళ్ళాడు. అప్పటికే భార్య పంకజం వేసే కుశలప్రశ్నలకి, సబిత మానసికంగా బాధ నుండి తేరుకోవడానికి చేసే ప్రయత్నం, దేనికీ స్పందించకుండా మెల్లగా లోపలికి వెళ్ళి, చిన్నగా ఓ చిరునవ్వు విసిరి, ప్రయాణ బడలికతో అలసిపోయినవాడిలా సోఫాలో చతికిల పడిపోయాడు.

విఠల్‌కి ఒకే అమ్మాయి 'సబిత' ఇంటర్ ఫైనల్ కొచ్చింది. విఠల్ నెలలో పదిహేను రోజులు వ్యాపారరీత్యా క్యాంపులే. ఇంట్లో సబితకు ఉన్నంతలో అడిగింది ఏదీకాదనరు. కాని ఆమె చదువులో ఏపాటి శ్రద్ధచూపుతుంది గాని, లోటుపాట్లను మనసు విప్పి మాట్లాడే తీరికగాని విఠల్‌కి లేవు. యాంత్రికమైన జీవితం అయనది. ఇంటిపట్టునే

ఉన్న పంకజం కూతురికి వేళకి భోజనం, కావలసిన దుస్తులు సమకూర్చడమే తప్పించి కూతురి మానసిక వికాసానికి, మనోచాపల్యానికి బేరీజువేసే తీరిక, కావలసిన నిర్ణయాలు తీసుకునే సమర్ధత పంకజానికి లేదు.

ఆ రోజు భోజనాలయ్యేవరకు సబితను ఒక కంట కనిపెడుతూ, అవకాశం చూసుకొని మెల్లగా అసలు విషయం కదిపాడు విఠల్.

" సబితా, చదివెలా సాగుతోంది. ఫాలో అవుతున్నావా?" అంటూ అతి సాధారణంగా, ఆప్యాయంగా అడిగాడు. తండ్రి ముఖంలోకి తీక్షణంగా చూసింది సబిత. తన ఉనికిని అంత ఖచ్చితంగా ఎలా కనిపెట్టాడా అని ఒకింత ఆశ్చర్యపడినా నిశ్చయముగా ఏదో చెప్పాలనుకుంది.

"డాడీ క్లాసులో కూర్చున్న దగ్గర్నుండి ఏదో టెన్షన్‌గా ఫీల్ అవుతున్నాను. లెసన్స్ ఏమీ అర్థంకావడంలేదు" అంది మెల్లగా అమాయకంగా ముఖంపెడుతూ.

" ఎంచేత కాన్సన్‌ట్రేషన్ చేయలేకపోతున్నావ్' కాస్తంత చిరాకు కనపరుస్తూ అడిగాడు విఠల్.

"సారు సీరియస్‌గా లెసెన్స్ చెప్పుకుంటూ పోతారు. మధ్యలో అందర్నీ వదిలి నన్నే ప్రశ్నిస్తారేమోనని, ఆన్సర్ చేయకపోతే ఫ్రెండ్స్‌ంతా ఎగతాళి చేస్తారేమోనని బెంగ గొంతు పిడచకట్టుకుపోయినట్లు ఒకటే గుండెదడ..."

"ఇలా ఎప్పటిన్నుంచి జరుగుతోంది. లెక్చరర్స్ అలా ప్రశ్నించి ఎవరినన్నా ఇన్‌సల్ట్ చేసారా యిదివరలో" అంటూ విఠల్ సబిత మాటలకడ్డొచ్చాడు.

సబిత తిరిగి ఏదో చెప్పాలనుకుంటుండగా తిరిగి విఠల్ అన్నాడు " ఇంట్లో కూర్చొని నోట్స్ రివిజన్ చేస్తున్నావా, లేదు. టివి సీరియల్స్ మీద వున్న యింట్రస్టు క్లాసుపుస్తకాల మీద వుంటే కదా, తీరా సబ్జెక్ట్ రాకపోయే సరికి క్లాసురూంలో నోరెళ్ల బెట్టవలసి వస్తోంది. అవునా, అంటూ విఠల్ విద్యార్థి దశలో పరిస్థితి ఎలా వుంటుందో ఎంతో అనుభవం వున్నవాడిలా అంచనా వేస్తున్నట్లు చెప్పాడు.

ఆ మాటలకు పంకజం చివ్వునలేస్తూ సబితవైపు వకాల్తా పుచ్చుకున్నట్లు " అలా అంటారేమిటండీ, మీరు వూళ్ళో వుంటున్నారా ఏమన్నా? అదెంత కష్టపడి చదువుతుందో మీకేంతెలుసు. రోజూ అర్ధరాత్రి వరకు పట్టుకున్న పుస్తకం విడిచి పెట్టదు. టీవి ప్రోగ్రామ్స్ అన్నీ చూస్తున్నది నేనుగాని అది కాదు." అంది పంకజం ఎంతో గారాబంగా.

సబిత మనసు నొప్పించానేమోనని కొంచెం వెనక్కి తగ్గాడు విఠల్.

"ఇప్పుడు నేనేమన్నాను. అది శ్రద్ధగా చదువుకుంటే ఎవరు కాదంటారు." అంటూ విఠల్ నెమ్మదిగా ఓదార్చుతు గొంతుక సవరించుకున్నాడు.

సబిత మెల్లగా అంది. "క్లాసులో మాలో మాకే చాడీలు చెప్పి పోటీతత్వాన్ని పెంచాలని ప్రయత్నిస్తున్నారు సార్స్, మార్కులు తగ్గించి మా తెలివితేటలకి పదును పెడుతున్నామంటున్నారు. క్షణం తీరిక లేకుండా హోమ్‌వర్కిస్తూ ప్రిపేరవమంటున్నారు. పరీక్షల్లో బాగా స్కోరింగ్ చేయకపోతే మంచి కాలేజీలో సీటు రాదని, అంత డబ్బు వెచ్చించి ఆశలు పెట్టుకున్న పేరెంట్స్‌కు ఏం సమాధానం చెపుతామని అంటున్నారు. వాళ్ళ స్కిల్ కాపాడుకోవడానికి మమ్మల్ని హింసిస్తున్నారు. లేనిపోని ఒత్తిడిని మాపై తీసుకొస్తున్నారు. అందరం నానాయాతన పడుతున్నాం. మీకు తెలియదు మా మెంటల్ టెన్షన్." అంటూ తలని రెండు చేతులతో గట్టిగా నొక్కుకుంటూ కళ్ళు మూసుకొని" మూగగా రోదించింది.

తల్లిదండ్రులిద్దరూ చలించిపోయారు. " రిలాక్స్ బేబీ" అంటూ విఠల్ ఓదార్చాడు. పంకజం కూతురు మీద చేయివేసి ప్రేమగా నిమిరింది.

సబిత తేరుకుంటూ–" డాడీ, మొన్న యిదే సిట్యువేషన్ నాబెంచ్‌మీట్ 'లలిత' హాస్టల్‌లో ఫ్యాన్‌కు చీరచుట్టుకొని ఉరేసుకుంది. ఆ దెబ్బతో అందరం హడలిచచ్చాం. కాని కాలేజీ వాళ్ళకి చీమకుట్టినంత బాధ కూడా లేదు. ఆమెదొక లవ్‌స్టోరీ అని, కేరక్టర్‌లేదని అపనిందవేసి ప్లేట్ ఫిరాయించి సీన్ మార్చేసారు. నిజం చెప్పినా నమ్మేదెవరు?"

ఆ లలిత నా ప్రక్కనే కూర్చొనేది. నేను యిప్పుడు ఎలాగైతే ఫీల్ అవుతున్నానో అదీ అలాగే నాతో చెప్పేది. అదే ప్రతీక్షణం జ్ఞాపకం వస్తోంది భరించలేకపోతున్నాను అంటూ సబిత చెప్పలేనంత దు:ఖం కళ్ళల్లో కన్నీరు ఉబికివస్తుంటే పంకజం తట్టుకోలేక కూతుర్ని వాటేసుకుంది.

కూతురు ఆవేదనకు ఎలా ఆనకట్ట వేయాలో తెలియక సతమతమవుతూ ఆవేశంగా అలాగే కూర్చొండి పోయాడు విఠల్ దీర్ఘాలోచనలో...

సబితను ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు. తండ్రిగా తన ఆశక్తతకు తననే నిందించుకున్నాడు.

ముందుగా సబితను కాలేజీ వత్తిడి నుండి తప్పించాలి. మనశ్శాంతిని కలిగించాలి. ఓదార్పు కావాలి. మళ్ళీ సబిత తనంతట తాను నిర్భీతిగా, నిస్సంకోచంగా చదువుమీద

శ్రద్ధ కలిగేటట్లు చేయాలి. మనసు విప్పి మాట్లాడింది. కాబట్టే జరగబోయే ప్రమాదాన్ని పసిగట్టడం జరిగింది. అశాంతికి, ఆందోళనకి ఆత్మహత్య పరిష్కారమార్గం కాకూడదు. విఠల్ ఆఫీసుకు నెలరోజులు శెలవు పెట్టాడు. సబితను ప్రతిమాటకు, ప్రతి పనిలో కలసికట్టుగా కబుర్లుచెప్తూ షాపింగ్‌కి, ఫుడ్ ఫెస్టివల్స్‌కు తీసుకువెళ్తూ ఎంతో మనోధైర్యాన్ని జీవితంలో వుండే తీయదనం, కుటుంబంలో వుండే ప్రేమ, తృప్తి ఏమిటో, ఎలా వుంటుందో చూపించాడు.

ఒక రోజు విఠల్ ఒక్కడే కాలేజి ప్రిన్సిపాల్‌ని కలవడానికి వెళ్ళాడు. ప్రిన్సిపాల్ రూంలో పెద్దకేకలు వినబడ్డాయి. ఎవరో లెక్చరర్‌తో వాదోపవాదనలు జరుగుతునాయి. పావుగంట పోయాక ఆ లెక్చరర్ విసురుగా తలుపుతోసుకొని వెళ్ళిపోయాడు. ఆతరువాత విఠల్ తన కూతురు సబిత మానసిక ఆందోళన గురించి టూకిగా చెప్పాడు. దానికి ప్రిన్సిపాల్ ప్రతిస్పందిస్తూ " సబిత చాలా తెలివైనది. మీరేమీ సంకోచించనవసరం లేదు. స్టడీస్‌లో ఏమాత్రం వెనుకబడినా, మేం మరింత కృషి చేస్తాం. స్పెషల్ కోచింగ్ క్లాసస్ పెట్టి టీచింగ్‌లో ఎటువంటి లోపం రానివ్వకుండా తర్ఫీదు పొందిన లెక్చరర్స్‌ని పెట్టి స్టేట్ ఫస్ట్ ర్యాంకు వచ్చేటట్లు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.' అంటూ ప్రిన్సిపాల్ తన ధోరణిలో తాను చెప్పుకుంటూపోతుంటే విసుగుపుట్టిన వాడిలా విఠల్ అడ్డుతగిలాడు.

"చూడండి, నేనో మాట చెపుతాను వినండి. ప్రైవేటు కాలేజీల ద్వంద్వ ప్రమాణాల గురించి రోజూ పేపరులో చదువుతూనే వున్నాం. తండ్రిలాంటి శిక్షణ, తల్లిలాంటి రక్షణ అని సంబోధిస్తూ ర్యాంక్స్ కోసం మీరు ఎన్ని అడ్డదారులు తొక్కుతున్నారో తెలియంది కాదు. పేపరు లీకేజీలో కాలేజి యాజమాన్యం పాత్ర లేదంటారా, ఎగ్జామ్‌హాల్‌లో ఇన్విజిలేటర్లను లోబర్చుకోవడం, లేబరేటరీలో ప్రాక్టికల్స్‌కి లంచాలిచ్చి మార్కులేసి పాస్ చేసే విధానం తప్పుకాదా" అంటూ విఠల్ తన ఉక్రోషాన్ని తట్టుకోలేనివాడిలా నిర్భయంగా ఎదిరించినట్లు మాట్లాడాడు.

ప్రిన్సిపాల్ ముఖం మాడిపోయింది. ఇప్పటివరకు ఏ పేరెంట్స్ తన ముందుకొచ్చి యిలా మాట్లాడలేదు.

" మీరు చాలా ఇన్‌సల్ట్‌గా మాట్లాడుతున్నారు. ఇప్పటివరకు స్టేట్ ర్యాంక్స్ కోసం ఎంతో హార్డ్‌వర్క్ చేసారు మా స్టాఫ్. అందుకే నెంబర్‌వన్ స్థానంలో వున్నాం. మా విద్యా ప్రమాణాల్ని ఎవరూ వ్రేలెత్తి చూపలేదు. మీరేంటి? ఇంత డామేజీగా మాట్లాడుతున్నారు." ప్రిన్సిపాల్ మరింత సీరియస్‌గా అన్నాడు. అయినా విఠల్ మౌనం వహించలేదు.

“మీ విద్యాలయాలు వ్యాపారనిలయాలుగా తయారయ్యాయి. కోచింగ్ జ్ఞానాన్ని మలిచేదిలా వుండాలి. సంప్రదాయ గౌరవాన్ని నిలబెట్టేదిగా వుండాలి. కాని మీరు కల్మషం చేస్తున్నారు. వ్యాపారపరిధిలోకి పోయి నిజమైన చదువును ప్రక్కనపెట్టి మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారు. మీ అనుభవరాహిత్యం వల్ల అమాయకులైన స్టూడెంట్స్ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇందుకు మొన్న మీకాలేజిలో జరిగిన సంఘటనే ఓ ఉదాహరణ. అవునా, కాదా” అంటూ విఠల్ తీవ్రమైన స్వరంతో ధ్వజమెత్తాడు.

ప్రిన్సిపాల్ మనసంతా వికలమైపోయింది. కోపం వచ్చినా తనలో తాను దిగమ్రింగుకున్నాడు. తనస్థానమేమిటో, పేరెంట్స్‌తో సంయమనం ఎలా పాటించాలో గుర్తుకుతెచ్చుకున్నాడు.

బజ్జర్‌నొక్కి ప్యూన్‌తో రెండు గ్లాసులు మంచినీళ్ళు రప్పించి, తానొకటి తాగి విఠల్‌ని కూడా తీసుకోమని సైగ చేశాడు. విఠల్ తాగి థ్యాంక్స్ చెప్పాడు. ఆ గదిలో ఫ్యాన్‌గాలితో పాటు, టేబిల్‌మీద వున్న పేపర్స్ రెపరెపలాడుతున్నాయి.

రెండు నిముషాల మౌనం తరువాత ప్రిన్సిపాల్ మెల్లగా అన్నాడు.

“ మీరొచ్చే ముందు నాతో ఒకాయన చాలా గొడవ చేసి, కేకలు వేసి వెళ్ళాడు”నిదానంగా విఠల్ ముఖంలోకి చూస్తూ కళ్ళద్దాలు సర్దుకున్నాడు ప్రిన్సిపాల్. ఏదో గొడవ జరిగినట్లుంది అన్నాడు విఠల్. ఆ టైమ్‌లో నేను బయటవెయిట్ చేస్తున్నాను. చూచాయగా ఏదో తెలిసినట్లు.

“అతడే మీ అమ్మాయి సబితను కూడా ట్రాప్ చేసాడు. లక్కీగా మేం పసిగట్టాం కాబట్టి సరిపోయింది. లేకపోతే లలిత సూసైడ్ చేసుకున్నట్లే సబిత కూడా స్పందిస్తే మా కాలేజికి మరింత చెడ్డపేరు వచ్చుండేది. మీరు మమ్మల్నెంతగా తిట్టిపోసినా ముందుగా సబిత మీతో మనసువిప్పి మాట్లాడింది కాబట్టి, ఇప్పుడన్నా అసలు విషయం తెలిసింది మీరు. పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారు. ” అంటూ ప్రిన్సిపాల్ తనలోని బాధని, మనస్తాపాన్ని వెలిబుచ్చేసరికి విఠల్ నిర్ఘాంతపోయి దిగ్గున కుర్చీలోంచి లేచినిలబడి ముందుకి వంగి ప్రిన్సిపాల్ చేతుల్ని పట్టుకుని కళ్ళకద్దుకున్నాడు ఉద్విగ్నంగా చలించిపోతూ.

విఠల మెదడు మొద్దుబారిపోయింది. నోటివెంట మాటరాక కళ్ళల్లో, నీళ్ళు జలజల రాలి ఇరువురి చేతుల్ని తడిపేసాయి. జరిగిన దానికి సిగ్గుపడుతూ నెమ్మదిగా వెనుదిరిగాడు.

(విది విలాసం, మార్చి 2006)